# వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు

ఊరవతల కాలవలో స్నానంచేస్తూ సూర్యోదయాన్ని చూసి ఆనందించడం ఇవ్వాళ్టి మాట కాదు. పసుపుతాడు మెడలో వేసుకుని ఏరు దాటి ఈ గడ్డ మీద కాలు పెట్టిన మర్నాటి నుంచీ క్రమం తప్పకుండా జరుగుతున్న విషయమే. ఇత్తడి బిందెని కాలవ వొడ్డున వున్న వొండ్రు మట్టితో తోముకోడం, తెచ్చుకున్న బట్టలన్నీ బండ మీద బాది బాది ఉతుక్కోవడం, ఆ పైన హాయిగా స్నానం, ఈలోగా సూర్యోదయం.

ఇవ్వాళ సూర్యుడు ఇంకా తేజోవంతంగా వున్నట్లనిపించింది ఆదిలక్ష్మికి, పాతికేళ్ళ ముందర కన్న. ఇష్టంగా రానీ, కష్టంతో రానీ - ఈ దిన చర్య తన జీవితంలో ఒక భాగం అయిపోయింది. ఇది తప్పి పోతున్నందుకు ఒక ప్రక్క ఆనందమే అయినా మరొక ప్రక్క విచారంగానూ వుంది.

"నీకేమమ్మా, ఇక నుంచీ హాయిగా ఇంట్లోనే స్నానాల గది వుంటుంది. వేన్నీళ్ళు పెట్టుకుని స్నానం చేస్తావు. ఏ జన్మలో ఏ నోము నోచుకున్నావో - ఎంకటేశుల్ని కన్నావు - నీ కష్టాలు గట్టెక్కాయి" అని ఊరు వాడా ఒకటే అంటూ వున్నా, సంతోషంతో పాటు కొంచెం భయంగా కూడా ఉంది. ఎన్నడూ ఊహించని క్రొత్త జీవితంలోకి అడుగు పెట్టడం గురించి.

బహుశా ఇదే ఈ వూరి ఆఖరి సూర్యోదయం చూడ్డం కావచ్చు తనకి. రెండు చేతులూ ఎత్తి సూర్య భగవానుడికి నమస్కరించింది ఆదిలక్ష్మి. కళ్ళ నిండా నీళ్ళు తిరిగాయి.

బట్టలన్నీ గట్టిగా పిండి పిడచలు పెట్టి గంపలో పెట్టుకుని తల మీద పెట్టుకుని వొడ్డుకి వచ్చింది. ఇప్పుడు మంచి నీళ్ల పంపులొచ్చాయి. "పీళ్ళకి కూడా మంచి నీళ్ళా!" అన్నట్లు ఏడుస్తూ వస్తాయి. షావుకారు సుబ్బయ్యగారింటి మీద గదంత నీళ్ళ ట్యాంకు మంచి నీళ్ళతో నిండాలి.

సర్పంచ్‌గారిది, పెద్ద డాక్టర్‌గారిది, ఇంకా ఖామందుగారిది, ఇలా వాళ్ళందరి ట్యాంకులూ మోటార్లు నింపేస్తాయి. ఈ లోగా పంపులు కట్టేస్తారు. వాళ్లకి బట్టలుతుక్కోడానికి, అంట్లు తోముకోడానికి, స్నానాలకి, ఆఖరికి పాయిఖానా దొడ్లో పంపులకి కూడా మంచి నీళ్ళే. ఇక్కడేమో రెండు బిందెలొచ్చే సరికి కాళ్లు పీకేస్తాయి. వుండడానికి తనకీ ఓ బావి వుంది. ఏం లాభం. సముద్రం నీళ్ళలా ఉంటాయవి. తోమిన గిన్నెలు నల్లబడి పోతాయి. బట్టలకి మురికి పోదు. పంపు వచ్చినంత సేపూ అక్కడ నిలబడి నిలబడి నీళ్ళు తెచ్చుకోవాలి. "నీకేంలే ఆదిలచ్చమ్మా. నీ కట్టాలు తీరిపోయినయ్. హాయిగా రేపటినించీ సాకల్ని ఎట్టేసుకుంటావు. సుకపడతావు" - కొంత అసూయ, కొంత అభినందన, అందరి గొంతుల్లో. ఏందో - పిచ్చి నాయనకి దిట్టి పెట్టేస్తున్నారు. వెంకటేశ్వర్లు సాయంత్రం వస్తున్నాడు. ఇక్కడ గోటీ బిళ్ళలాడిన వెధవ. అళ్ళ నాయనకి బీడీ కట్టలు మోసిన గుంటడు.

అళ్ళమ్మకి పంపు కాణ్నించీ నీళ్లు మోసి పెట్టిన పసి సన్నాసి - ఊరికి, పేటకి - వంశానికి - కుటుంబానికి - తల్లి తండ్రులకి ఖ్యాతి తెచ్చాడు - కష్టాలు తీర్చాడు - ఊబిలో నుంచీ లాగి స్వర్గంలోకి తీసుకు వెడుతున్నాడు - పుణ్యం అంటే వాళ్ళదే -

సాంబయ్య తాగితేనేం - ఆదిలక్ష్మిని కొడితేనేం - ఆదిలక్ష్మి నిజంగా దేవత అనుకో - అందుకే దానికి దేవుడు మేలు చేశాడు - మంచితనం ఊరికే పోదు -

వేంకటేశ్వర్లుకి వచ్చిన ఉద్యోగం సానా మంచిదంట - నౌకర్లు చాకర్లు - మందీ మార్బలం - పైన కూడా బాగా సంపాదన వుంటదంట-

మన షావుకారు గారి రెండో అల్లుడు సెయ్యడంలా అలాంటి దేనంట-

ట్రెయినింగయి పోయి, పోస్టింగ్ వేయించుకొని వస్తున్నాడు - ఏ వూరేశారో ఏమో!

ఆదిలక్ష్మి ఇల్లలికింది - గోడలకి సున్నం వేసింది - మంచానికి వున్న నవార్లన్నీ ఉడకబెట్టి ఉతికి, తెల్లగా చేసి అల్లింది-

దుప్పట్లన్నీ కాలవ దగ్గర బాదీ బాదీ ఉతికింది - ఇంట్లో రవ్వంత బూజు లేకుండా దులిపింది - సాంబయ్య తెనాలి నుంచీ కప్పులు కొనుక్కొచ్చాడు. ఇన్‌స్టెంట్ కాఫీ పొడి తెచ్చాడు - సాంబయ్య చెల్లెలు సావిత్రి మేనల్లుడొస్తున్నాడని బియ్యం పిండి స్వయంగా కొట్టి

అరిసెలొండి తెచ్చింది. సావిత్రి కూతురు జ్యోతి వెంకటేశ్వర్లుకి ఈడు - దాన్ని కొట్టీ తిట్టీ చదివించి టెన్త్ ప్యాసు చేయించి తెనాలి కాలేజికి పంపిస్తోంది. అదంతా వెంకటేశ్వర్లు కోసమే- జ్యోతిని ఇవ్వాళ కాలేజికి వెళ్ళద్దంది సావిత్రి.

సాంబయ్య తెల్లని ఇస్త్రీ పంచె కట్టాడు. అతనిప్పుడు 'ఏంరా సాంబయ్య' కాదు వెంకటేశ్వర్లుగారి తండ్రి సాంబయ్యగారు. బీడీలు మానేస్తాడు. మంచి సిగరెట్టు త్రాగుతాడు. - అణా కానీ సారాయి మానేసి అబ్బాయిని బ్రతిమాలి రోజుకో క్వార్టరు మంచి మందు కొనుక్కుంటాడు.

సాంబయ్య రెండో కొడుకు, వెంకటేశ్వర్లు తమ్ముడు గోపాలకృష్ణుడు చదువుకోలేదు. అలాగని చదువుకోకుండానూ వుండలేదు - వాడు అప్పటి నించీ చదువుకుంటూనే వున్నాడు కానీ ఇంకా ఇంటర్ ప్యాస్ కాలేదు - ఇదుగో వెంకటేశ్వర్లే వాడినొక దారికి తీసుకురావాలి-

వెంకటేశ్వర్లు చెల్లెలు లక్ష్మి తెనాలి కాలేజిలో బి.ఏ. చదువుతోంది - అన్నలా పెద్ద చదువులు చదవాలని, పెద్ద ఉద్యోగం చెయ్యాలని కలలు కంటోంది. అందరి కలలూ నిజం అయ్యే సమయం ఆసన్న మయింది-

వెంకటేశ్వర్లు సాయంత్రం వస్తున్నాడు. 'అడు పెట్టెలయ్యీ మోసుకొని రాలేడు. నువ్వెల్లి బస్ స్టాండింగు కాడ వుండు - ఏబస్‌లో వత్తాడో ఏమో!" అని గోపాలకృష్ణుణ్ణి నాలుగు గంటల నుంచే బస్‌స్టాండ్‌లో నిలబెట్టాడు సాంబయ్య.

వీధి వీధంతా వెంకటేశ్వర్లు కోసం ఎదురు చూస్తోంది -

ఊరు ఊరంతా కూడా ఎదురు చూస్తోంది-

సాయంత్రం అయిదు గంటల వేళ లక్ష్మి వీధి వాకిట్లో దుమ్ము అణగడానికి పేడ నీళ్ళు చల్లి ముగ్గు వేసింది. ఆదిలక్ష్మి వసారాలో నవ్వారు మంచం వేసి శుభ్రమైన దుప్పటి వేసింది - గోపాల కృష్ణుడు గేదె దగ్గర అప్పటి కప్పుడు గోరు వెచ్చని పాలు తీసుకొచ్చేడు.లక్ష్మి కప్పులన్నీ తళ తళా తోమి పెట్టింది.

"ఈడు మన కొడుకు కాదా ఏం! ఏంటిలాగ పరాయి వాడొత్తున్నట్లు మనందరం అడావుడి పడిపోతున్నాం!" అని ఆశ్యర్య పడింది ఆదిలక్ష్మి. పళ్ళెంలో హారతి సిద్ధం చేస్తూ-

"ఆడికి రాగానే అరతి పట్టు వదినా!" అని సావిత్రి యిందాకే చెప్పిపోయింది-

బస్ స్టాండులో బడ్డీ కొట్టు దగ్గర నిలబడి కాళ్లుపీక్కు పోతున్న గోపాలకృష్ణుడు!

హారతి పళ్ళెం పక్కనెట్టుకుని నవారు మంచం మీద కూర్చుంటే దుప్పటి మాస్తుందని క్రింద కూర్చున్న ఆదిలక్ష్మి -

వీధి మొదట్లోనే నిలబడ్డ సాంబయ్య -

వెంకటేశ్వర్లు రావడం తాము చూడలేమేమోనన్న ఆతురతలో తొంగి తొంగి చూసే ఇరుగు పొరుగులు -

వెంకటేశ్వర్లు వచ్చాడు - అతను బస్‌లో రాలేదు - సినిమాల్లో చూపించే ఎర్రటి కారులో వచ్చాడు - ఒక్కడే రాలేదు - వెంట ఇంకొకాయనతో వచ్చాడు - పెట్టెలూ సంచులూ లేవు - చేతులూపుకుంటూ వచ్చాడు. ఆదిలక్ష్మి ఉలిక్కిపడి వెంకటేశ్వర్లుకి హారతిచ్చింది - అతనితో వచ్చినాయినని చూసి, ఆ కారు ఆయనదని గ్రహించింది.

డ్రయివరు పళ్ళ బుట్ట తెచ్చి గుమ్మంలో పెట్టాడు -

"ఈయన వెంకట్రామయ్యగారమ్మా - నేను హైదరాబాద్‌లో వుండి పరీక్షలకి ప్రిపేర్ అయినప్పుడు నాకు చాలా సాయం చేశారు - వీళ్ళమ్మాయి అనూరాధ కూడా నాతో పరీక్షలు వ్రాసింది. తనకి సెలక్షన్ రాలేదనుకో -"

ఓట్లడగడానికి వచ్చే రాజకీయ నాయకుడిలా ఆయన అందరికీ నమస్కారం చేసి, మంచం మీద కూర్చున్నాడు.

వాళ్లిద్దరి ప్రక్కనా తను కూర్చోవచ్చో, కూర్చో కూడదో అర్థం కాలేదు సాంబయ్యకి. నిలబడి చూస్తున్న సాంబయ్యకి లక్ష్మి ఒక కుర్చీ పీట వేసి కూర్చోమంది -

"ఇక్కడ కూర్చో న్నాన్నా" అని జరిగి కొడుకు తనకి మంచం మీద చోటివ్వ లేదని సాంబయ్య అనుకోలేదుగానీ ఆదిలక్ష్మి అనుకుంది - అంత ఖరీదైన మనిషిని వెంటబెట్టుకుని రావడం ఎవరికీ నచ్చలేదు - వాళ్ల గొంతులు మూగబోయాయి -

లక్ష్మి వాళ్ళకి మంచి నీళ్ళిచ్చింది -

"నాకీ మధ్య చాలా సుస్తీ చేసిందమ్మా - అప్పట్నించీ ఎక్కడికెళ్ళినా కాగబెట్టిన నీళ్లు మోసుకు తిరుగుతున్నాను -" అని ఆయన కారులో నుంచి చల్లని మంచి నీళ్ళు పోసుకునే పెద్ద డబ్బా తెచ్చుకుని అందులో నుంచీ నీళ్ళు పోసుకుని కొన్ని వెంకటేశ్వర్లుకి కూడా యిచ్చాడు.

ఆదిలక్ష్మి రెండు ప్లేట్లల్లో అరిసెలూ, కారప్పూస తెచ్చి పెట్టింది.

"హార్ట్ పేషెంటునమ్మా - ఇవ్వన్నీ తినకూడదు -" అన్నాడాయన.

"మీ సావిత్రమ్మత్త నీకోసం చేసిందిరా ఎంకటేశులూ-" అన్నది ఆదిలక్ష్మి గొంతు పెగిలించుకుని -

వెంకటేశులు ఓ అరిసెముక్క కొంచెం తిని తల్లిని సంతోష పెట్టేడు.

అప్పటి కప్పుడు తీసిన పాలు కాచి ఇన్‌స్టంట్ కాఫీ పొడితో జాగ్రత్తగా కలిపిన కాఫీ తీసుకొచ్చి యిచ్చింది ఆదిలక్ష్మి -

పాపం అది మాత్రం వద్దనలేదు ఆయన.

వెంకటేశ్వర్లూ తీసుకున్నాడు.

"ఈ కారు కోసం ఆశపడి ఈయన్ని ఎంటేశుకు రాకపోతే హాయిగా బస్సులో వస్తే ఈ పాటికి అందరం ఎన్ని కబుర్లు చెప్పుకునే వాళ్ళం?" అనుకుంది వెంకటేశ్వర్లు చెల్లెలు లక్ష్మి -

/గోపాలకృష్ణుడు దూరంగా నిలబడ్డాడు.

"వీడు నా తమ్ముడు -" అని ఆయనికి వెంకటేశ్వర్లు పరిచయం చేయలేదు-

వెంకటేశర్లుని దిగబెట్టి ఎఱ్ర కారాయన వెళ్ళిపోతే మాట్లాడుకోవచ్చులే అనుకున్నాడు సాంబయ్య -

కానీ ఎఱ్రకారాయనతో పాటు వెంకటేశ్వర్లు లేచేడు.

"నేనొస్తానమ్మా - నాకింకా హైదరాబాద్‌లో పన్లున్నాయి - పోస్టింగ్ ఎక్కడిస్తారో తెలీలేదు - ఈ లోగా మిమ్మల్ని చూసి పోదామని వచ్చాను -" అన్నాడు -

'పోట్టింగేదో వచ్చేదాకా ఇక్కడుండరాదూ?" అంది ఆదిలక్ష్మి ధైర్యం కూడగట్టుకుని-

"చెప్పాను గదా - నాకు కొన్ని పన్లున్నాయని! మళ్లీ వచ్చి వుంటాను -" అన్నాడు-

ఎఱ్రకారులో వెంకటేశ్వర్లు వెళ్ళిపోయాడు - వీధికి ఆశాభంగం -వూరికి ఆశాభంగం - ఇంటికి మరింత ఆశాభంగం -

అప్పుడెళ్లిన వెంకటేశ్వర్లు మళ్ళీ వచ్చాడు - ఈ సారీ ఎఱ్రకారులోనే వచ్చేడు - కానీ రాజకీయ నాయకుడిలాంటాయనతో రాలేదు - ఆయన కూతురుతొ వచ్చేడు-

ఆ అమ్మాయి అదిలక్ష్మికీ, సాంబయ్యకీ నమస్కారం చేసి కొత్త బట్టలు యిచ్చింది -

లక్ష్మికి ఒక ముత్యాల దండ, గోపాలకృష్ణుడు కొక రిస్టువాచీ యిచ్చింది - రెండు బుట్టలతో పళ్ళు, రెండు ప్యాకట్లతో స్వీట్లు యిచ్చింది.

అల్లుడి కోసం నెల రోజులు వెన్న పూస దాచి దాచి కరగేసిన నెయ్యితో అరిసెలు వండిన సావిత్రమ్మ కళ్ళంట నీళ్ళు ధారలు కట్టాయి - కూతురి చదువు కోసం పెట్టిన డబ్బంతా బూడిదలో పోసినట్లు అయిపోయింది -

ఈ అమ్మాయి తమ లోకం మనిషి కాదు - తమ రంగు కాదు - తమ భాష కాదు - తమ తిండి కాదు - మంచం మీద పొందికగా కూర్చున్న ఆ అమ్మాయి "ఇక్కడ కూర్చోండి నా ప్రక్కన" అని జరిగి అదిలక్ష్మికి చోటివ్వలేదు -

వాళ్ళంతా నిలబడి వుండడం చాలా సహజం అన్నట్లు ప్రవర్తించింది -

అదిలక్ష్మి పెట్టిన భోజనాన్ని వేళ్ళతో కెలికి తిన్నట్లు నటించింది -

'ఓ పెద్ద మంత్రిగారు ఓ కూలీల కాలనీని దర్శించడానికి దయదలచివచ్చినట్లు వుంది' అనుకుంది వెంకటేశ్వర్లు చెల్లెలు లక్ష్మి.

ప్రొద్దున్న వచ్చిన వెంకటేశ్వర్లు సాయంత్రం దాకా వున్నాడు. సాయంత్రం దాకా వున్న వెంకటేశ్వర్లు చాలా చెప్పాడు -

ఈ పల్లెటూర్లో - ఈ దుమ్ములో - మీరుండ లేరన్నాడు. కాపురం తెనాలి తరలించమన్నాడు. అక్కడ మంచి నీళ్ల పంపు వున్న మంచి ఇల్లు తీసుకోమన్నాడు. నెల నెలా డబ్బు పంపుతానన్నాడు.

"అయితే మమ్మల్ని నీతో తీసుకెళ్లవా?"

"నన్నేసింది ఈ జిల్లాలో కాదు - అక్కడ మీరుండ లేరు - ఇదంతా మీకు అలవాటైన చోటు -" అన్నాడు -

"తెనాలిలో మా నాన్నగారికి ఇల్లుంది - అది ఖాళీ చేయించి యిస్తాం - మంచి ఇల్లు - అందులో వుండండి - మేం ఎప్పుడైనా వచ్చినా ఈ పల్లెటూరికి రావడం కష్టం - ఓ రోజుండాలన్నా - ఆ ఇంట్లో మీరు ఎన్నాళ్ళైనా వుండొచ్చు. నాకొచ్చే యిల్లే అది-" అంది వెంకట్రామయ్యగారమ్మాయి అనూరాధ - చాలా దయగా -

"మీకేం లోటు రానివ్వను - నేను డబ్బు పంపుతాగా!"

ఆదిలక్ష్మి కుప్పకూలి పోయింది-

పాతికేళ్లుగా సాంబయ్య చేత తిన్న దెబ్బలన్నీ మళ్లీ తగులు తున్నట్లని పించాయి-

కొడుకు దగ్గర వుంటే సాంబయ్య భయంగా వుంటాడని, తనకి వెంకటేశర్లు తల్లిగా ఓ గౌరవం వుంటుందని ఆశ పడింది. రేపటినించీ కొడుకు మీద కోపం చూపించడానికి తను తప్ప ఇంకెవరుంటారు సాంబయ్యకి?

రేపటి నించీ ఊరి జనం అనే మాటలు భరించలేని సాంబయ్య ఎంత తాగుతాడో - ఏం చేస్తాడో ఊహించడం కూడా కష్టం -

వీడి కోసం ఎంత రెక్కల కష్టం చేసింది తను? షావుకారి భార్య చీరెలు ఉతకడం దగ్గర్నుండీ - ఒక పనా? ఎంత కారం కొట్టింది? ఎంత పిండి దంచింది?

వీడు కనీసం దగ్గర కొచ్చి ఒకసారి భుజం మీద చెయ్యివేసి "అమ్మా!" అని పలకరించాడా? డబ్బు పంపుతాడట!

వెంకట్రామయ్యగారి కూతురు ముందు తను ఏడవగలదా? గొంతు పూడుకుపోదా! ఎంత కష్టపడ్డా ఇన్నాళ్లూ అదంతా శారీరకమైన కష్టమే- మనస్సులో ఆశ ఎంత కష్టాన్నైనా మరిపించింది. ఆశే ప్రాణం - ఇప్పుడు ఇంకేం మిగిలింది?

డబ్బులు పంపుతాడట వెంకటేశ్వర్లు!

"అన్నయ్య చెప్పింది బావుందమ్మా మనం తెనాలి వెళ్ళి పోదాం-" అంది లక్ష్మి - పొయ్యి దగ్గర కూర్చుని కళ్లు తుడుచుకుంటున్న ఆదిలక్ష్మితో.

"అవునమ్మా - మొన్నటి దాకా వూరంతా అన్నయ్యని ఆకాశానికెత్తేశారు. రేపటి నించీ తిట్టి పోస్తారు - రక రకాలుగా మాట్లాడతారు - ఇవ్వాళ్టిదాకా నువ్వు పుణ్యం చేశావన్నారు. రేపట్నుంచీ నువ్వేం పాపం చేశావో నంటారు - ఇప్పటి దాకా ఒక ఆశతో బ్రతికాం - రేపట్నించీ మళ్లీ కొత్తగా మొదలు పెడదాం - ఈ పల్లెటూరి కష్టాలు మనం పడలేం - మనలాంటి వాళ్లకి పట్నాలే నయం - అక్కడ మనని గురించి ఎవరూపట్టించుకోరు - పైగా, ఫలానా వారి తల్లీ తండ్రీ అని తెలిస్తే పరిచయాలు పెంచుకుని స్నేహాలు చేస్తారు-"

"ఎవరేం అన్నా - ఏం అనుకున్నా ఫరవాలేదు - ఈ ఇల్లు మనది - ఇక్కడ మనకి గేదెలున్నాయ్ - మన చేత పని చేయించుకుని సాయం చేసే మనుసులున్నారు - నా రెక్కల్లో ఇంకా సత్తువుంది - పోయి ఎవురింటోనో ఎందుకుండాల నేను. నాకే మవసరం?? ఆడికి పల్లెటూరు రావడం - ఇట్టాంటి గుడిసెలో వుండటం యిట్టం లేక తెనాలి పొమ్మంటాడు - నేను పోను - అంత ఆపేచ్ఛే వుంటే పంపే డబ్బు ఇక్కడికే పంపమను - ఇక్కడుంటే మా బతుకు మేం బతుకుతాం - అక్కడికి పోతే ఆడు డబ్బు పంపితే గతి, లేకపోతే లేదు - ఆడికాడ వుండనప్పుడు ఎక్కడుంటే వాడికేమిటి? నేను డబ్బుకి ఆశ పడ్డానా? ఆడికాడుండటానికి ఆశ పడ్డానా? నీకు అర్థం కాదే!" అని బావురుమంది ఆదిలక్ష్మి.

"చీకటి పడుతోంది వెంకట్?" అంటోంది ఆ అమ్మాయి.

"బయలుదేరదాం- " అని లేచి నిలబడ్డాడు వెంకటేశ్వర్లు.

"ఈ డబ్బు నీ దగ్గరుంచు నాన్నా! తెనాల్లో ఇల్లు బాగు చేయిస్తాం - అక్కడికి మారిపొండి - నేను రెండు నెలలాగి మళ్లీ వస్తాను - మీరేం బాధపడకండి - నేను కొంచెం సెటిల్ అవగానే మీకు డబ్బు పంపుతాను -" అన్నాడు, తండ్రి చేతిలో ఓ పదివేలు పెట్టి-

"ఇప్పుడే ఎందుకింత డబ్బిస్తున్నావు?" అనలేదు సాంబయ్య-

"డబ్బుతో మా ఋణం తీర్చేసుకుంటున్నావా?" అనలేదు-

బుద్ధిగా నోట్ల కట్ట అందుకుని జేబులో పెట్టుకున్నాడు-

ఏదో వండుతున్న నెపంతో పొయ్యిదగ్గరే వుండి కళ్లు తుడుచుకుంటోంది ఆదిలక్ష్మి -

"మీ అమ్మని పిలు! అళ్ళెళ్ళి పోతారంట - కాపీ కలుపుకు రమ్మను-" అని కూతురికి పురమాయించేడు సాంబయ్య.

"వస్తామమ్మా!" అని చెప్పడానికి కొడుకు లోపలి కొస్తాడేమో, ఒక్కసారి వాణ్ణి కౌగిలించుకుని గట్టిగా ఏడవాలనుకుంది ఆదిలక్ష్మి.

"వాళ్ళకి కాఫీ తెమ్మంటున్నాడు నాన్న" అని లోపలికి వచ్చింది లక్ష్మి -

"నువ్వు కలుపుకు వెళ్ళు" అంది ఆదిలక్ష్మి .

లక్ష్మి కళ్ళల్లో కూడా నీళ్ళు వచ్చాయి.

అన్నయ్యదగ్గర వుండి పై చదువులు చదవాలన్న కలలన్నీ ఈ కట్టెపుల్లల్లాగే మండిపోయాయి -

మళ్ళీ తనకే నవ్వొచ్చింది -

అన్నయ్యని ఎవరు దగ్గర పెట్టుకుని చదివించారు? పాపం ! తన కష్టం తనే పడ్డాడు!

కాఫీ కప్పులతో తల్లీ కూతుళ్లు వసారాలో కొచ్చేరు -

"వస్తాను -" అంది ఆ అమ్మాయి-

ఆ స్థానంలో జ్యోతి ఉంటే "అత్తమ్మా " అని పిలిచి తన వొడిలో వాలిపోయేది -

ఈ పిల్లని ఒక్కసారి ముట్టుకోవాలని, చేతిని తన చేతిలోకి తీసుకోవాలని అనిపించినా, నిగ్రహించుకుంది - అలా చేయవచ్చునో కూడదో తెలీని అజ్ఞానురాలు కదా తను!

దుఃఖాన్ని అదిమి పట్టుకుని పేలవమైన ఒక నవ్వు నవ్వి, ఆమె నుదుట బొట్టు పెట్టి ఆమె తెచ్చిన పళ్ళే కొన్ని చేతిలో పెట్టింది ఆదిలక్ష్మి -

"ఇవి మీ కోసం తెచ్చాం గదా! అక్కడ చాలా వున్నాయి. మీరుంచుకోండి -" అని మంచం మీద పెట్టింది ఆ అమ్మాయి మళ్ళీ

స్కాలర్ షిప్పులతో చదువుకుని పైకొచ్చాడన్న అభిమానంతో, స్నేహంతో, ప్రేమతో, అతనికి ప్రోత్సాహం యిచ్చి దగ్గరుండి పరీక్ష వ్రాయించి అతని పురోభివృద్ధికి ప్రధాన కారకురాలైన అమ్మాయి - ఇప్పుడు శ్రీమతి అనూరాధా వెంకట్ - ఆమె లేకపోతే వెంకటేశ్వర్లు ఈ రోజు ఇలా వుండడు.

మీరేం చేశారు వెంకటేశ్వర్లుకి! కూలీకి పంపకుండా చదువుకోనిచ్చారు - ప్రభుత్వం స్కాలర్ షిప్ యిచ్చింది - సీట్లిచ్చింది - కాకపోతే బట్టలు కుట్టించారు - తిండి పెట్టారు - అంతేగా! మీరు చెప్పించిన చదువులతో అతనికీ ఉద్యోగం వచ్చేదా? హైద్రాబాద్ వెళ్లి చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుని కష్టపడి చదువుతూ వుంటే - ఈ దేవత సాక్షాత్కరించింది. జాలిపడి చెయ్యి అందించింది -

పైకి లాగింది -

ఈమే లేకపోతే ఈ రోజు వెంకటేశ్వర్లు ఇలా ఉండడు. ఇదంతా మధ్యాహ్నం వెంకటేశ్వర్లు ఆదిలక్ష్మికి చెప్పేడు. వెంకటేశ్వర్లు మంచివాడు. పాపం వాడికి కృతజ్ఞత చాలా ఎక్కువ.

"మా అమ్మ మా కోసం పడని కష్టం లేదు - మా అయ్య వున్న ఎకరం నేల అమ్మేసి - చేసే పని మీదొచ్చే పది రూపాయలు కూడా సజావుగా ఇంటికి యివ్వకపోతే ఈ విడే రెక్కలు ముక్కలు చేసుకుని సంసారం నిలిపింది. నాట్లే వేసిందా, కలుపులే తీసిందా, కోతలే కోసిందా,

కారమే దంపిందా, అంట్లే తోమిందా, ఆ పన్లన్నీ లెక్కబెట్టడానికి రావు - ఆవిడే లేకపోతే ఈ రోజు వెంకటేశ్వర్లు గొడ్లను మేపుకుంటూ గోటీ బిళ్ళలాడే వాడు-" అని బహుశా వెంకటేశ్వర్లు అనూరాధకి కూడా చెప్పేవుంటాడనుకుంది ఆదిలక్ష్మి. అలా అనుకోడంలో సంతృప్తి కోసం -

ఎర్రకారు బయలు దేరింది వెంకటేశ్వర్లుని ఎక్కించుకుని -

అతను వెళ్ళిపోయేడు.

ఆ వెళ్ళడం శాశ్వతం గానే - అనిపించగా ఆదిలక్ష్మి గుండె చెరువయ్యింది.

ఆ రాత్రి ఆదిలక్ష్మికి ఎంతకూ కునుకు పట్టలేదు.

'తన వెంకన్నని, పెద్ద పెద్ద చదవులు చదివి ఆఫీసరైన వెంకట్‌ని, ఆ పట్టపోళ్ల ఆడపిల్లనీ, ఆస్తినీ ఎరచూపి పడేసుకున్నారా? లేక తామే తమ పేరాశతో చేజేతులా కొడుకుని జారవిడుచుకున్నారా?'

అలా ఆమె ఆలోచనలు ఎంతసేపూ కోడలి కుటుంబం తమ కుటుంబం చుట్టూ తిరుగుతున్నాయేగాని యీ పాతికేళ్ళలో వెంకటేశ్వర్లుజీవితానుభవం అతనిలో ఏ పరిణామాలు తెచ్చుంటుందో - అని ఆ వంకగా ఆమె ఆలోచించలేకపోయింది.

అలా మహా మహా వాళ్ళే చూడలేరు. ఆదిలక్ష్మనగా ఎంత?

*(రచన సచిత్ర మాసపత్రిక : డిసెంబర్ '94)*